# నెహ్రూ జూ పార్కులో హై అలర్ట్!

- మూగజీవుల ఆవాసాల వద్ద ప్రత్యేక చర్యలు
- థాయ్‌లాండ్‌లో 72 పులుల మృతితో అప్రమత్తం
- కోవిడ్ తరహా ప్రోటోకాల్ అమలు
- ఆవాసాల్లో కొత్త ఇసుక, కెమికల్ పిచికారీ
- జూలోకి కొత్తగా 'మాండ్రిల్' కోతులు




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** థాయ్‌లాండ్‌లోని ఒక ప్రైవేట్ జూలో అంతుచిక్కని వైరస్ సోకి ఏకంగా 72 పులులు మరణించడం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఈ వార్తతో అప్రమత్తమైన హైదరాబాద్ నెహ్రూ జూలాజికల్ పార్క్ అధికారులు, ఇక్కడి మూగజీవుల రక్షణకు కఠిన చర్యలు చేపట్టారు. క్యూరేటర్ వసంత ఆదేశాల మేరకు పులుల ఆవాసాల వద్ద కోవిడ్ సమయంలో పాటించిన ప్రోటోకాల్‌ను మళ్ళీ అమలు చేస్తున్నారు. ఆవాసాల్లో పాత ఇసుకను తొలగించి కొత్త ఇసుకను వేయడంతో పాటు, గోడలకు సున్నం వేయడం, సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేయడం వంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

**వ్యాధి నిరోధకతపై ప్రత్యేక దృష్టి**

వైద్యాధికారులు జూలోని ప్రతి ఆవాసాన్ని నిశితంగా పరిశీలిస్తున్నారు. పులులు, సింహాల సందర్శన కేంద్రాల్లో క్రిమి సంహారక మందులను చల్లుతున్నారు. పక్షులకు కూడా వైరల్ ఇన్ఫెక్షన్లు సోకకుండా వాటిలో రోగ నిరోధక శక్తిని పెంచే మందులను ఆహారంతో పాటు అందజేస్తున్నారు. వన్యప్రాణుల ఆరోగ్య విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకుండా నిరంతర నిఘా ఉంచామని అధికారులు స్పష్టం చేశారు.

**మాండ్రిల్ కోతుల సందడి**

జంతువుల బదిలీ కార్యక్రమంలో భాగంగా నెహ్రూ జూ పార్కులోకి కొత్తగా 'మాండ్రిల్' (నామాల కోతులు) చేరుకున్నాయి. జంషెడ్ పూర్ జూ నుంచి రెండు మగ మాండ్రిల్ కోతులను ఇక్కడికి తీసుకువచ్చారు. వీటికి బదులుగా హైదరాబాద్ జూ నుంచి ఒక జత ఆఫ్రికన్ సింహాలను జంషెడ్ పూర్ పంపించారు. ముఖంపై రంగుల నామాలతో విభిన్నంగా కనిపించే ఈ కోతులు త్వరలోనే పర్యాటకులను అలరించనున్నాయి.


**జంతువుల దత్తత.. సామాజిక బాధ్యత**

వన్యప్రాణుల సంరక్షణలో భాగంగా జూ పార్క్ నిర్వహిస్తున్న దత్తత కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఇప్పటి వరకు 62 మంది దాతలు సుమారు 89 జంతువులను దత్తత తీసుకున్నారు. దత్తత తీసుకున్న వారికి ఆదాయపు పన్ను చట్టం 80జీ కింద పన్ను మినహాయింపు లభిస్తుంది. అలాగే ఉచిత ప్రవేశ టికెట్లు, గెస్ట్ హౌస్ వసతి కల్పిస్తారు. ఒక్కో జంతువు నిర్వహణ ఖర్చు ఒక్కోలా ఉంటుంది. ఏనుగులు, జిరాఫీలకు ఏడాదికి రూ.5 లక్షలు కాగా, పులి లేదా సింహానికి రూ.3 లక్షలు ఖర్చవుతుంది. రైనోలకు రూ.2 లక్షలు, చిరుతలు, తోడేళ్లకు రూ.లక్ష, పక్షులు మరియు పాములకు ఏడాదికి రూ.50 వేలుగా నిర్ణయించారు.

# గూగుల్ సెర్చ్ చేస్తున్నారా? జాగ్రత్త..

- సైబర్ కేటుగాళ్ల 'SEO' ట్రాప్ పై సీపీ సజ్జనార్ హెచ్చరిక
- టాప్ రిజల్ట్స్‌లో కనిపించేవన్నీ నిజమైన వెబ్‌సైట్లు కావు
- పెయిడ్ యాడ్స్, అడ్వాన్స్‌డ్ ఎస్ఈఓతో నకిలీ లింకులు
- బ్యాంకింగ్, కస్టమర్ కేర్ నంబర్ల కోసం వెతికే వారే లక్ష్యం
- 'స్పాన్సర్డ్' లింకులపై క్లిక్ చేసే ముందు URL పరిశీలించండి
- మోసపోతే వెంటనే 'గోల్డెన్ అవర్'లో 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయండి





**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** గూగుల్ వంటి సెర్చ్ ఇంజన్లలో మనం ఏదైనా సమాచారం కోసం వెతికినప్పుడు మొదట కనిపించే వెబ్‌సైట్లన్నీ అసలైనవి కావని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రజలను హెచ్చరించారు. సైబర్ నేరగాళ్లు అత్యంత అధునాతన ఎస్ఈఓ పద్ధతులు, పెయిడ్ యాడ్స్ ఉపయోగించి తమ నకిలీ వెబ్‌సైట్లను సెర్చ్ రిజల్ట్స్‌లో ముందు వరుసలో ఉంచుతున్నారని ఆయన ఎక్స్ వేదికగా వివరించారు. సాధారణంగా వినియోగదారులు పైన కనిపించే లింక్‌లే నిజమైనవని నమ్మి క్లిక్ చేస్తారని, ఇదే సైబర్ నేరగాళ్లకు వరంగా మారుతోందని పేర్కొన్నారు.

**బ్యాంకింగ్, కస్టమర్ కేర్ వివరాలే టార్గెట్**

ముఖ్యంగా కస్టమర్ కేర్ నంబర్లు, బ్యాంకింగ్ సేవలు, ఆన్‌లైన్ పేమెంట్లకు సంబంధించిన సమాచారం కోసం వెతికేవారు ఈ ట్రాప్ లో చిక్కుకుంటున్నట్లు సైబర్ నిపుణులు గుర్తించారు. ఈ నకిలీ సైట్లు చూడటానికి అసలైన బ్యాంకు లేదా ప్రభుత్వ పోర్టల్‌ను పోలి ఉండి, వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తాయి. వెబ్‌సైట్‌లోకి ప్రవేశించగానే లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్, ఓటీపీ వంటి వ్యక్తిగత వివరాలను సేకరించి, క్షణాల్లో బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారని సీపీ సజ్జనార్ వివరించారు. 'స్పాన్సర్డ్' అని ఉన్న ప్రతి లింక్‌ను నమ్మవద్దని, వెబ్‌సైట్ అడ్రస్‌ను ప్రతి క్షణం క్షుణ్ణంగా పరిశీలించాలని సజ్జనార్ సూచించారు.

**గోల్డెన్ అవర్ ప్రాముఖ్యత**

ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. మోసం జరిగిన మొదటి గంటను 'గోల్డెన్ అవర్'గా పరిగణిస్తారని, ఈ సమయంలోపు ఫిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్మును వెనక్కి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని సీపీ వెల్లడించారు. ఎల్లప్పుడూ అధికారిక వెబ్‌సైట్లను నేరుగా బ్రౌజర్‌లో టైప్ చేసి ఓపెన్ చేయడం, నమ్మకమైన యాప్స్ ద్వారా మాత్రమే లావాదేవీలు జరపడం సురక్షితమని ఆయన పేర్కొన్నారు.

**జాగ్రత్తలు ఇవే..**


సెర్చ్ ఇంజన్లలో వచ్చే మొదటి లింకులను కళ్లు మూసుకుని నమ్మకండి. వెబ్‌సైట్ అడ్రస్‌లో అక్షర దోషాలు ఉన్నాయేమో గమనించండి. కస్టమర్ కేర్ నంబర్ల కోసం నేరుగా ఆయా సంస్థల అధికారిక వెబ్‌సైట్లకే వెళ్లండి. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులపై క్లిక్ చేయవద్దు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను సంప్రదించండి.



## అడవిలో మిగిలింది 11 మందే: డీజీపీ

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** మావోయిస్టు పార్టీలో తెలంగాణ ప్రాంతానికి చెందినవారిలో ఇక మిగిలింది 11 మందేనని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. ఇందులో ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు, ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఇద్దరు జిల్లా కమిటీ సభ్యులు, నలుగురు ఏరియా కమిటీ సభ్యులు ఉన్నట్లు వివరించారు. ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు మాత్రమే తెలంగాణ ప్రాంతంలో అజ్ఞాతంలో ఉన్నారని, మిగిలినవారంతా ఇతర రాష్ట్రాల్లో పనిచేస్తున్నట్లు తెలిపారు. పార్టీలో మొత్తం కేంద్ర కమిటీలోనే ప్రస్తుతం ముగ్గురు ఉన్నారని, ఇందులో ఇద్దరు తెలంగాణకు చెందినవారన్నారు. తెలంగాణకు చెందిన కేంద్రకమిటీ సభ్యుల్లో ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి, పసునూరి నరహరి అలియాస్ సంతోష్ ఉన్నారు. రాష్ట్రకమిటీ సభ్యుడు ముప్పిడి సాంబయ్య అలియాస్ సుదర్శన్ ఉన్నారు. తెలంగాణ మావోయిస్టులు పార్టీలో 2023 నాటికి రాష్ట్రానికి చెందినవారు మొత్తం 124 మంది ఉంటే ఇప్పుడు కేవలం 11 మందికి తగ్గిపోయి ఆ పార్టీ ప్రభావం కనీస స్థాయికి చేరుకున్నట్లు వివరించారు. రెండేండ్ల వ్యవధిలోనే సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు, 15 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 25 మంది డివిజనల్ కమిటీ సభ్యులు, 63 మంది ఏరియా కమిటీ సభ్యులు, 437 మంది పార్టీ సభ్యుల చొప్పున మొత్తం 591 మంది లొంగిపోయారని, వారితో పాటు 142 ఆయుధాలు ప్రభుత్వానికి అప్పగించినట్లు తెలిపారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తా : దేవ్‌జీ



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** దశాబ్దాల పాటు సాయుధ పోరాటంలో కొనసాగిన మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు సెంట్రల్ కమిటీ ఇన్‌ఛార్జి తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ మంగళవారం జనజీవన స్రవంతిలోకి వచ్చారు. డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో లొంగిపోయిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేవలం అనారోగ్య కారణాల రీత్యా మాత్రమే తాను రహస్య జీవితం నుంచి బహిరంగ జీవితంలోకి రావాల్సి వచ్చిందని ఆయన స్పష్టం చేశారు. తన నిర్ణయం వెనుక వ్యక్తిగత ప్రయోజనాలు ఏవీ లేవని.. ప్రజా సమస్యల పట్ల తన నిబద్ధత కొనసాగుతుందని వివరించారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం చట్టబద్ధమైన మార్గాల్లో పోరాటం చేస్తానని ప్రకటించారు. పార్టీలో తలెత్తిన అంతర్గత సంక్షోభం.. మల్లోజుల వేణుగోపాల్ వైఖరిపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు దేవ్‌జీ ఆచితూచి స్పందించారు. ప్రస్తుతం తాను అంతకంటే ఎక్కువ విషయాలు చెప్పలేనని.. వివరంగా మాట్లాడే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఏదైనా ఒక వ్యక్తి గురించి లేదా ఒక విషయం గురించి మాట్లాడితే అది అనవసరమైన చర్చలకు.. అపార్థాలకు దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. వివాదాలకు తావు లేకుండా ఉండాలనే ఉద్దేశంతోనే తన అభిప్రాయాలను అత్యంత సంక్షిప్తంగా చెబుతున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ప్రత్యేకంగా ఇంటర్వ్యూలు ఇచ్చినప్పుడు అన్ని విషయాలను సమగ్రంగా వివరిస్తానని మావోయిస్టు మాజీ అగ్రనేత వెల్లడించారు.

## విగ్రహం కోసం ప్రజల్ని ఇబ్బంది పెట్టొద్దు

**- గాంధీ మనవడు తుషార్**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** హైదరాబాద్‌లో మహాత్మా గాంధీ విగ్రహ నిర్మాణం కోసం జరుగుతున్న భూసేకరణపై ఆయన ముని మనవడు తుషార్ గాంధీ స్పందించారు. తెలంగాణ ప్రభుత్వాన్ని, సీఎం రేవంత్ రెడ్డి ని ఉద్దేశిస్తూ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. గాంధీ విగ్రహం కోసం స్థానిక ప్రజలను వారి నివాసాల నుంచి తరలించడం గాంధీ విధానాలకు వ్యతిరేకమని తుషార్ అన్నారు. దయచేసి అలాంటి చర్యలు చేపట్టవద్దని సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. బాపు జీవించి ఉంటే నా పేరుతో ఇలా చేయొద్దు, వెంటనే ఆపేయండి అని చెప్పేవారని పేర్కొన్నారు. గాంధీజీ ఆలోచనలు అహింస, సామరస్యానికి ప్రతీకలని, ప్రజల హక్కులు, గౌరవాన్ని కాపాడటమే ఆయన సిద్ధాంతమని తుషార్ గాంధీ గుర్తు చేశారు. ఆయన పేరుతో ప్రజలను ఇళ్ల నుంచి వెళ్లగొట్టడం ఆయన ఆలోచనలకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.





## ఖమ్మంలో కాంగ్రెస్ 'రాక్షస కాండ'

- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు
- పేదల ఇళ్ల కూల్చివేత అమానుషం
- వేల మంది పోలీసులతో యుద్ధ వాతావరణం
- ఇది ప్రజాస్వామ్యమా? లేక పోలీస్ రాజ్యమా?
- నోటీసులు లేవు.. ప్రత్యామ్నాయం లేదు
- రూపాయి రూపాయి పోగేసిన గూడు చెల్లాచెదురు
- బాధితుల ఆవేదన ఈ ప్రభుత్వాన్ని దహించి వేయడం ఖాయం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** ఖమ్మం నగరం వెలుగుమట్ల వినోబా నగర్‌లో పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. వేల మంది పోలీసుల పహారాలో, నాలుగు జిల్లాల బలగాలను మోహరించి ఒక యుద్ధ వాతావరణాన్ని సృష్టించి ఇళ్లను కూల్చాల్సిన అవసరం ఏమొచ్చిందని ఆయన ప్రశ్నించారు. అప్పులు చేసి పేదలు నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం అత్యంత హేయమైన చర్య అని, పేద ప్రజలు ప్రభుత్వానికి తీవ్రవాదుల్లా కనిపిస్తున్నారా అని నిలదీశారు. పోలీసులను అడ్డం పెట్టుకుని మీడియాను రాకుండా అడ్డుకుంటున్నారంటేనే ప్రభుత్వం చేస్తున్న అరాచకం బయటకు తెలియకూడదనే భయం కనిపిస్తోందని హరీశ్ రావు విమర్శించారు. "చీకటి పనులు చేసేవారే మీడియాను చూసి భయపడతారు" అంటూ ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని నమ్మబలికిన రేవంత్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు.. నేడు ఉన్న ఇళ్లను కూలగొట్టి పేదలను నడిరోడ్డుపై నిలబెట్టడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

**గుండె తరుక్కుపోతున్న బాధితుల రోదన**

ఓటు వేసినందుకు మాకు తగిన శాస్తి జరిగింది అని బాధితులు రోదిస్తుంటే చూసి గుండె తరుక్కుపోతోందని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి కట్టుకున్న ఇళ్లను ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా కూల్చడం అమానుషమని పేర్కొన్నారు. బాధితుల కన్నీళ్లకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

**బీఆర్ఎస్ అండగా ఉంటుంది**

వెంటనే అక్రమ కూల్చివేతలను ఆపి పోలీసులు వెనక్కి వెళ్లాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారికి అండగా ఉంటుందని స్పష్టం చేశారు. పేదలపై కర్రలు ఎత్తడం మానేసి, ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై దృష్టి పెట్టాలని సూచించారు. నిర్వాసితులకు న్యాయం చేయకుండా ఇంచు భూమి కూడా కదిలించడానికి వీల్లేదు అని స్పష్టం చేస్తూ, పేదల గూడు చెదిరితే ప్రభుత్వ గద్దెలు కూడా అంతే వేగంగా కూలుతాయని హెచ్చరించారు.

## కుమ్మెర ఘటనలో నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి



**విశ్వంభర, నాగర్ కర్నూల్ :** అగ్రకుల దురహంకారంతో బీసీ కుటుంబానికి చెందిన వారిపై అమానుషంగా దాడి చేసి పసికందు మరణానికి కారణమైన వాళ్లపై హత్యకేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, బీసీ యూత్ జేఏసీ చైర్మన్ కట్టెకోలు దీపెందర్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కట్టెకోలు దీపెందర్ మాట్లాడుతూ ఆరు రోజుల క్రితం టికెట్ లేకుండా కుమ్మెర గ్రామంలోని మల్లన్న గుడిలోకి ప్రవేశించిన కారణంగా చాకలి కులస్తులైన గణేష్ చంద్రకళ మౌనికలపై ఆ గ్రామ సర్పంచ్ తుకారం రెడ్డి మరియు సతీష్ రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మధుసూదన్ రెడ్డిలు ఇంకా కొంతమంది రాయలేని భాషలో దురహంకారంతో అతి కిరాతకంగా భయంకరంగా వారిపై దాడి చేసి మరియు రెండు నెలల పసి పాప ప్రాణాలు బలిగొన్న హంతకులను కఠినంగా శిక్షించి తక్షణమే బాధిత కుటుంబానికి భద్రత కల్పించి ప్రభుత్వ పరంగా యాభై లక్షల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నల్గొండ నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, ఉపాధ్యక్షుడు వనం వెంకటేశ్వర్లు, నల్గొండ పట్టణ అధ్యక్షుడు విశ్వనాధుల శివకుమార్, నిరుద్యోగ జేఏసీ జిల్లా చైర్మన్ పాల్వాయి రవి, కొడదల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కగార్ ఆపరేషన్-2ను తక్షణమే నిలిపేయాలి

**సీపీఐ రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు**




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ 2 నిలిపివేసి మావోయిస్టులను గౌరవప్రదంగా జన జీవన స్రవంతిలో కలిసేందుకు అనువైన వాతావరణం కల్పించాలని వామపక్షాలు, రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సాయుధ పోరాట పంథాను వీడి జన జీవన స్రవంతిలోకి రావాలని కోరారు. అర్బన్ నక్సలైట్ల పేరుతో వరవరరావు లాంటి వారిపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టులు ప్రజా క్షేత్రంలోకి రావాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లోని మగ్దూంభవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు.

**అంతిమ లక్ష్యం నుంచి వైదొలగ్గాలిన అవసరం లేదు: కూనంనేని సాంబశివరావు ..**

కేంద్ర ప్రభుత్వం తక్షణమే సుహృద్భావ వాతావరణాన్ని కల్పించి ఏలాంటి కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడకుండా లైకుండా గౌరవ ప్రదమైన పునరావాసం కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. కమ్యూనిస్టులది మార్క్సిజమే అంతిమ లక్ష్యమని, దానిని నుండి వైదొలగాల్సిన అవసరం లేకుండా మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమ పంథాను మాత్రం మార్చుకోవాల్సిన అవసరముందని, ఆ దిశగా మావోయిస్టులు ఆలోచించి జనజీవన స్రవంతిలోకి రావాలని ఆయన కోరారు. మారుతున్న పరిస్థితులు, అందివచ్చిన సాకేంతిక పరిజ్ఞానం నేపథ్యంలో సాయుధ పోరాటం అనేది ఇప్పుడు అసాధ్యమన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తం చేశారు. తుపాకుల ద్వారా కాకుండా ప్రజాస్వామిక ఉద్యమాలు, ప్రజా పోరాటాల ద్వారా సైతం విప్లవాన్ని సాధించవచ్చాని అందుకు నేపాల్ లాంటి దేశాలు ఉదాహరణ అని సాంబశివరావు పేర్కొన్నారు.ఈ దేశ పౌరులైన మావోస్టులను లక్ష్యంగా చేసుకుని వారిని వరస పెట్టి తుదముట్టించేంత యుద్ధాన్ని కేంద్ర ప్రభుత్వంకొనసాగిస్తోందని తెలిపారు. మన దేశంపై పదే పదే దురక్రమాణకు పాల్పడే పాకిస్తాన్‌పైన గాని ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని కేంద్రం ఎందుకు యుద్ధం చేయడం లేదని ప్రశ్నించారు. ఎర్రజెండా అంటే పాలకులకు భయమని, అందుకే వారిని తుది ముట్టించేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎవరూ ఎవరిని చంపిన చట్ట ప్రకారం నేరమని, మావోస్టులు తప్పులు చేస్తే చట్ట పరిధిలో శిక్షించాలే తప్ప 2026 మార్చి 31 అంటూ లక్ష్యం పెట్టుకుని చంపివేడం ఏమిటాని ప్రశ్నించారు. కేంద్రం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని, మావోయిస్టులు జనజీవన స్రవంతిలోకి రావాలని కూనంనేని సాంబశివరావు కోరారు.

**మావోయిస్టులను శత్రు పూరితంగా చూడడం సరైంది కాదు : ఎమ్మెల్సీ కోదండరామ్..**

మావోస్టుల సిద్ధాంతాలతో ఏకీభావం ఉండకపోవచ్చుగాని వారిని శత్రు పూరితంగా ప్రజా కంటకులుగా చూస్తే దోరణి మాత్రం సరైంది కాదని ఎంఎల్‌సీ ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. ప్రజల కోసం నిలబడి వారి కోసమే పని చేస్తున్న మావోయిస్టులది రాజకీయ పార్టీ కాబట్టి వారిపట్ల కేంద్రం విద్వేషంతో వ్యవహరించడం తగదన్నారు. మావోయిస్టుల పట్ల కేంద్ర ప్రభుత్వం చట్టప్రకారం వ్యవహరించాలని కోదండరామ్ విజ్ఞప్తి చేశారు.

**ప్రజల ప్రధాన సమస్యలే ఎజెండా ముందుకు సాగాలి : సీపీఎం నేత బండారు రవికుమార్..**

ఆర్ఎస్ఎస్ భావజాలంతో కొనసాగుతున్న కేంద్ర ప్రభుత్వానికి రాజ్యాంగమన్నా, ప్రజాస్వామిక విలువలను ఏమాత్రం లెక్కే లేకుండ పోయిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారి రవి కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మావోయిస్టులు సాయుధ పోరాటాన్ని విమరించుకుంటామ ప్రకటించడమే కాకుండ, మరికొందరూ అయుధాలను సైతం ప్రభుత్వానికి అప్పగించి అనేక మెట్లు దిగివచ్చిన మావోయిస్టులపై ఈ దమన కాండను కొనసాగించడం దుర్మార్గమన్నారు.

**కేంద్రానిది నియంత పాలన : సీపీఐ(ఎంఎల్ న్యూడెమోక్రసీ) నేత చలపతి రావు**

కగార్ ఆపరేషన్‌తో ఇప్పటికే మావోయిస్టుల పార్టీ ప్రధాన నాయకులను మట్టు పెట్టిన కేంద్రం ఇప్పుడు కగార్ ఆపరేషన్ 2 పేరుతో మావోయిస్టుల సానుభూతి పరులను కింది స్థాయి క్యాడర్‌పై నిర్బాంధాన్ని కొనసాగిస్తూ రాజ్యహింసకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఈ ఫాసిస్టు ప్రభుత్వం మావోయిస్టులనే కాదు ఈ దేశంలో ఉద్యమాలను, ప్రశ్నించే గొంతికలను, చివరికి ప్రతిపక్షాలను సైతం లేకుండా చేసి నియంత పాలన కొనసాగించడమే అంతిమ లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ నైపథ్యంలో మావోస్టులు సైతం ప్రజాక్షేత్రంలో వచ్చి ప్రజాస్వామిక వాదులు, ప్రజాతంత్ర శక్తులుతో కలిసి ప్రజా ఉద్యమాలను కొనసాగించాల్సి అవసముందని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్ లిబరేషన్) రాష్ట్ర కార్యదర్శి రమేష్ రాజా, సీపీఐ (ఎంఎల్ మాస్‌లైన్) నాయకురాలు రమా, ఆర్ఎస్పీ నాయకులు జానకి రాములు, పౌర హక్కుల సంఘం నాయకులు నారాయణ మాట్లాడుతూ మావోస్టులు జన జీవన స్రవంతిలో కలిసే క్రమంలో ప్రభుత్వాలు ఇచ్చే రివార్డులను స్వీకరించారాదని కోరారు.దేశంలో అప్రకటిత ఎమర్జెనీ కొనసాగుతోందని, ఫాసిస్టు విధానాలను ఎదుర్కొనేందుకు కమ్యూనిస్టులు మరింత బలపడాల్సి ఉందన్నారు. అదాని, అంబాని లాంటి పెట్టుబడి దారుల కనుసన్నల్లో నడుస్తున్న బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఖనిజ సంపదను కార్పోరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు ఈనరమేధాన్ని సృష్టిస్తోందని పేర్కొన్నారు. 2024 జనవరి 1 నుంచి మొదలు పెట్టిన కగార్ ఆపరేషన్ పేరుతోకేంద్రం ఇప్పటికే 90 ఎన్‌కౌంటర్లు, 1000 మందికి పైగా హత్యలను చేసిందన్నారు. కగార్ ఆపరేషన్ కేవలం మావోయిస్టులను అడ్డు తొలగిస్తే తప్ప అడవుల్లో నిక్షిప్తమైన ఉన్న కోట్లాది విలువైన ఖనిజ సంపదను దోచుకోవడం సాధ్యం కాదని భావించి కేంద్ర ప్రభుత్వం ఈ ఆపరేషన్ చేపట్టిందన్నారు. ఆ సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీఎస్.బోస్, వామపక్ష పార్టీల నాయకులు బి. స్టాలిన్, ఛాయాదేవి, గోవర్ధన్, ఎస్ఎల్ పద్మ, ప్రజా సంఘాల నాయకులు అంజయ్య నాయక్, మారపాక అనిల్ కుమార్, ఎన్.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.